క్లుప్తంగా

ఆర్థిక సాయం

ఆత్మకూరు: పట్టణంలోని వీరభద్ర కాలనీలో శనివారం రాత్రి సిలిండర్ పేలి పూరి గుడిసె దగ్ధమైన ఘనటలో బాధితురాలు ఈరమ్మకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదివారం ఆర్థిక సాయం చేశారు. ఆయన మాట్లాడుతూ జాతర్లలో చిన్నపిల్లలు ఆడుకునే బొమ్మల వ్యాపారం చేస్తూ జీవిస్తున్న ఈమెకు జగనన్న కాలనీలో పక్కాగృహం మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రూ.20 వేలు నగదుతో పాటు కౌన్సిలర్లతో కలిసి రూ.35 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అంజాద్‌అలీ, కో ఆప్షన్ సభ్యుడు రఫీద్, నాయకులు విజయచౌదరి, పువ్వాడ భాస్కర్, సుల్తాన్, విజయ్, రవినాయక్, శివపార్వతి పాల్గొన్నారు.

రేపు మండల మీట్

మిడుతూరు: స్థాని ఎంపీడీఓ కార్యాలయ భవనంలో ఈనెల 14వ తేదీన ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. అలాగే గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీ హాజరు కావాలని కోరారు.

స్టేట్ స్పీడ్ బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎన్నిక

వెలుగోడు: స్టేట్ స్పీడ్ బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా లిటిల్ ఏంజిల్స్ స్కూల్ కరస్పాండెంట్ ఎంఎఫ్ ఇమ్మానుయేలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల గుంటూరులో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో చోటు దక్కడంపై ఆదివారం ఆయనను పలువురు సత్కరించారు.

ఆలయాభివృద్ధికి విరాళం

మహానంది: గౌడ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణగౌడు రూ.పదివేలు విరాళం అందించినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మహానందిలోని గరుడనంది ఆలయాభివృద్ధికి విరాళం అందించారని చెప్పారు. దాతకు స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

మహానందిలో భక్తుల సందడి

మహానంది: సెలవు రోజు, పెళ్లిళ్లు ఉండటంతో ఆదివారం మహానంది క్షేత్రం భక్తులతో కళకళలాడింది. వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది తరలివచ్చారు. ముందుగా స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. ఉదయం మహామంగళ హారతుల సేవతో ప్రారంభమైన దర్శనం రాత్రి ఏకాంతసేవ వరకు నిర్విరామంగా కొనసాగింది.

వెంకటాపురం -శ్రీశైలం మధ్య ప్రత్యేక బస్సులు

ఆత్మకూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైల క్షేత్రానికి తరలివెళ్తున్న భక్తుల సౌకర్యార్థం ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి వెంకటాపురం, శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో సీఐ కోటయ్య తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతతో మాట్లాడుతూ ఆత్మకూరు చేరుకున్న భక్తులు వెంకటాపురం చేరుకునేలా నాలుగు బస్సులను, ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి 10 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

బండిఆత్మకూరు: పెద్దదేవళాపురం గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడిన సంఘటనలో గాయపడిన బాధితులను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పరామర్శించారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని ఉదయానంద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సిబ్బందిని అడిగి వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం బాధిత కుటుంబాలకు రూ.30వేల ఆర్థిక సాయం అందజేశారు.

17 నుంచి ఓంకారంలో బ్రహ్మోత్సవాలు

బండిఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఈఓ నాగప్రసాద్, విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 17న బండిఆత్మకూరులోని శివాలయం నుంచి ఉత్సవ విగ్రహాలు మంగళ వాయిద్యాల మధ్య క్షేత్రానికి బయలుదేరాతాయని, 18 ఎరకలకాలనీ, శింగవరం, సోమయాజులపల్లె గ్రామాల్లో గ్రామోత్సవాల అనంతరం ఓంకార క్షేత్రం చేరతాయని చెప్పారు. ఆరోజు రాత్రి లింగోద్భవ కాలంలో మూలవరులకు మహాన్యాస రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ఉత్సవ మూర్తులకు కల్యాణం జరిపిస్తామన్నారు. 19న నంది వాహనంపై ఆది దంపతుల ఊరేగింపు, 20 సాయంత్రం రథోత్సవం, 21న వసంతోత్సవం, 22న ఆదిదంపతులు ఓంకారం నుంచి బండిఆత్మకూరు శివాలయానికి చేరుకుంటారని వివరించారు.

ఆదరణకు నోచుకోక..

- శిథిలావస్థలో పురాతన శివాలయాలు
- పట్టించుకోని పురావస్తుశాఖ అధికారులు



పురావస్తుశాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు



శిథిలమవుతున్న భుజంగేశ్వరస్వామి దేవాలయం



ఆదరణకు నోచుకోని పురాతన సిద్దేశ్వరస్వామి ఆలయం

జూపాడుబంగ్లా : ఆదాయం లేదనే సాకుతో పురాతనమైన శివాలయాలను దేవదాయశాఖ, పురావస్తు శాఖ అధికారులు పట్టించుకోకపోవటంతో ఆలయాలు కాస్త శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. శ్రీశైలం బ్యాక్‌వాటర్ గ్రామాలను ముంచెత్తడటంతో సంగమేశ్వరం క్షేత్రంలో సుమారు 118 ఏళ్ల క్రితం నిర్మించిన శివాలయాలను 44 ఏళ్ల క్రితం జూపాడుబంగ్లాలో పునర్నిర్మించారు. పురాతన ఆలయాలు కావటంతో వాటిని పురావస్తు శాఖ స్వాధీనం చేసుకుంది. ఆదాయం లేదనే సాకుతో పురాతనశాఖ ఆలయాలను విస్మరించటంతో నాడు ఓ వెలుగు వెలిగిన ఆలయాలు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. శ్రీశైలం డ్యాం నిర్మాణం అనంతరం సంగమేశ్వరం మునకకు గురికావటంతో అక్కడున్న భుజంగేశ్వర, సిద్దేశ్వర ఆలయాలను 1982లో జూపాడుబంగ్లా శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మించారు. ఎంతో అద్భుత శిలా సంపదతో ఆశ్చర్యచకితులను చేసేలా నిర్మించబడిన దేవాలయాలను పురావస్తు శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆలనాపాలన లేకపోయింది. భుజంగేశ్వర, సిద్దేశ్వరస్వామివార్లను పూజించిన వారికి శక్తి,యుక్తులు సిద్దిస్తాయని భక్తుల నమ్మకం. భుజంగేశ్వరస్వామి దేవాలయంలోకి ఓ నాగుపాము వచ్చి స్వామివారికి చుట్టుకుంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. అలికిడి చేస్తే పాములు గర్భగుడిలో మాయమై దేవాలయ గోపురం మీద ప్రత్యక్షమవుతుందని చెబుతున్నారు. దేవాలయంలోకి పాముల వచ్చి పోవటానికి వీలుగా ఆలయ నిర్మాణంలో గోపురం నుంచి గర్భగుడిలోకి పాము పట్టేంత మార్గం ఉందంటున్నారు. ఈనెల 18న జరిగే శివరాత్రి పర్వదినం రోజు భక్తులు అధిక సంఖ్యలో స్వామివార్లను దర్శించుకుంటారు. కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తులు ఈ ఆలయాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు.

సమాజంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

జూపాడుబంగ్లా: విద్యార్థులకు విద్యతో పాటు సమాజంపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని నందికొట్కూరు జూనియర్ సివిల్ జడ్జి తిరుమలరావు తెలిపారు. పట్టణంలోని శ్లోక సీబీఎస్ఈ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను శనివారం రాత్రి అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా జడ్జి తిరుమలరావు, కరస్పాండెంట్ డాక్టర్ జె.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్లు కవిత, శ్రీదేవిరెడ్డి, రమేష్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ విద్యానంద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులను సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న జడ్జి తిరుమలరావు

పాదయాత్ర భక్తులకు స్పర్శ దర్శనం కల్పించాలి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- పాదయాత్రగా శ్రీశైలం చేరుకున్న ఎమ్మెల్యే దంపతులు



శ్రీశైల దేవస్థాన చైర్మన్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పాదయాత్రగా వచ్చే భక్తులకు శ్రీశైల మల్లన్న స్పర్శ దర్శనం కల్పించాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరారు. ఆదివారం వెంకటాపురం నుంచి పాదయాత్రగా ఎమ్మెల్యే దంపతులు శ్రీశైలం చేరుకున్నారు. వీరికి దేవస్థాన అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామిని, భ్రమరాంబాదేవిని దర్శించుకున్న అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివారి శేషవస్త్రం, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ 2009 నుంచి ప్రతి శివరాత్రికి పాదయాత్రగా శ్రీశైలం వస్తున్నానని, కరోనా ప్రభావంతో గత రెండేళ్లు రాలేదని చెప్పారు. ఎమ్మెల్యే కాటసానిని శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, సభ్యులు ఓ.మధుసూదన్‌రెడ్డి కలిశారు.

భక్తులకు వసతులు కరువు



కైలాసద్వారం వద్ద బోర్డుకే పరిమితమైన దేవస్థాన అన్నప్రసాద వితరణ

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పాదయాత్రగా తరలివస్తున్న భక్తులకు కష్టాలు ఎదురవుతున్నాయని పలువురు వాపోతున్నారు. శనివారం నుంచి శ్రీగిరిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండో రోజు ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు పాదయాత్రగా శ్రీగిరి చేరుకుంటున్నారు. వారికి పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకటాపురం నుంచి భీముని కొలను వరకు సుమారు 9 కి.మీ. మేర తాగునీటి వసతి లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు లీటర్ వాటర్ రూ.35 నుంచి రూ.40 అమ్ముతున్నారన్నారు. అటవీ మార్గంలో సూచిక బోర్డులు లేవని, భక్తులు ఏదేని అస్వస్థతకు గురైన పట్టించుకునే వారు కనిపించడం లేదని, తోటి భక్తుల సహాయంతోనే వస్తున్నామని చెబుతున్నారు. కాలినడక భక్తులకు ఈ నెల 11 నుంచి రిస్ట్ బ్యాండ్లు అందిస్తామని చెప్పినా ఇవ్వడం లేదని వాపోయారు. కైలాసద్వారం వద్ద కుళాయిలు ఏర్పాటు చేయకపోవడంతో తాగునీటి ట్యాంకుల వద్దనే స్నానాలు చేస్తున్నారు. ఆరుబయటే మహిళలు దుస్తులు మార్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కైలాసద్వారం వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. అయితే కొంత మందికే వడ్డించి ముగిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.

ప్రజాప్రతినిధుల ఓటరు జాబితా విడుదల

- మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నికలు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 101 మంది ఎంపీటీసీలు
- 9మంది జెడ్పీటీసీలు, 55మంది కౌన్సిలర్లు

జూపాడుబంగ్లా: మార్చి 13వ తేదీన నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఆదివారం ఎంపీడీఓలు ప్రజాప్రతినిధుల ఓటరు జాబితా విడుదల చేశారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, బండిఆత్మకూరు, జూపాడుబంగ్లా, కొత్తపల్లి, నందికొట్కూరు, పగిడ్యాల, పాములపాడు, వెలుగోడు, మిడ్తూరు మండలాల పరిధిలో ఎంపీటీసీలు 101మంది, జెడ్పీటీసీలు 9మంది ఉన్నారు. ఆత్మకూరు, నందికొట్కూరు మున్సిపాల్టీల పరిధిలో 55 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరందరూ ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఆత్మకూరులో 11మంది ఎంపీటీసీలు, బండిఆత్మకూరు-14, పాములపాడు 12, వెలుగోడు-14, మిడుతూరు, నందికొట్కూరు మండలాల్లో 11 మంది, జూపాడు బంగ్లా, కొత్తపల్లి మండలాల్లో 9మంది చొప్పున ఎంపీటీసీలు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అలాగే ఆయా మండలాల పరిధిలో 9 మంది జెడ్పీటీసీలు, ఆత్మకూరు, నందికొట్కూరు మున్సిపాలిటీల్లో 55మంది కౌన్సిలర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు నందికొట్కూరు ఎంపీడీఓ శోభారాణి తెలిపారు. ఈ మేరకు ఆయా మండలాల పరిధిలో ఫొటోలతో కూడిన ప్రజాప్రతినిధుల ఓటరు జాబితాను విడుదల చేసినట్లు చెప్పారు. వీటిపై అభ్యంతరాలుంటే ఈనెల 18వ తేదీ లోపు లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

మూడు క్షేత్రాల్లో కరివేన అన్నదాన సత్రాలు



మాట్లాడుతున్న శ్రీనివాస్

శ్రీశైలం: ప్రముఖ పుణ్యక్షేత్రాలైన హరిద్వార్, అయోధ్య, అన్నవరం క్షేత్రాల్లో అఖిల భారత కరివేన బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు ఎస్‌ఆర్ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక కరివేన సత్రంలో ఏర్పాటు చేసిన వార్షిక సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో కరివేన నిత్యాన్నదాన సత్రాలు భక్తులకు అందుబాటులో ఉన్నాయన్నారు. శ్రీశైలంలో మరో అదనపు భవనం, అరుణాచలం, భద్రాచలంలలో కొత్త భవనాలను నిర్మించాలని తీర్మానించినట్లు చెప్పారు. ప్రస్తతం హరిద్వార్, అయోధ్య, అన్నవరంలో అద్దె భవనాల్లో సత్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాటికి శాశ్వత భవనాలు నిర్మించాలని కమిటి తీర్మాణించామని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి డా.ఎన్ వేణుగోపాల్, గౌరవాధ్యక్షులు కామరాజు, నరేంద్ర కుమార్,కోశాధికారి హరిహరరావు, ఉపాధ్యక్షులు మాధవరావు, మారుతి ప్రసాద్ , సహాయ కార్యదర్శులు చిదంబరం, రామకృష్ణ, సభ్యులు ప్రదీప్,రఘు, సతీష్ శర్మ, మనోహర్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా విడుదల

పగిడ్యాల: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల జాబితాను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం ప్రదర్శనకు ఉంచామని ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. 10 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ ఓటర్ల జాబితాను ప్రచురించామని వీటిపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 18వ తేదీలోపు ఫారం 17 జత చేసి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సమర్పించాలని చెప్పారు.

ఓటు వినియోగించుకోనున్న 7,695 మంది గ్రాడ్యుయేట్లు, 514 మంది టీచర్లు

జూపాడుబంగ్లా: మార్చి 13న జరగనున్న గ్రాడ్యుయేట్లు, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నందికొట్కూరు నియోజకవర్గంలో 7,695 మంది గ్రాడ్యుయేట్లు, 514 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. నియోజకవర్గంలో 5,670 మంది పురుష, 2,024మంది మహిళా గ్రాడ్యుయేట్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అలాగే 354 మంది పురుష ఉపాధ్యాయులు, 160 మంది ఉపాధ్యాయినులు ఓటు వేయనున్నారు. నందికొట్కూరు పట్టణంలో అత్యధికంగా 2,782 మంది గ్రాడ్యుయేట్లు, 275 మంది టీచర్లు ఉన్నారు. వీరికి పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. పగిడ్యాలలో 1,261 మంది గ్రాడ్యుయేట్లు, 79 మంది టీచర్లు ఓటర్లు ఉండగా వారికి జిల్లా పరిషత్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. జూపాడుబంగ్లా మండలంలో 941 మంది గ్రాడ్యుయేట్లు, 48 మంది టీచర్లు ఉండగా వీరికి ఏపీ మోడల్ స్కూల్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. కొత్తపల్లి మండలంలో 800 మంది గ్రాడ్యుయేట్లు, 36 మంది టీచర్లకు జిల్లా పరిషత్‌హైస్కూల్‌లో, మిడుతూరు మండలంలో 960 మంది గ్రాడ్యుయేట్లు, 40 మంది టీచర్లకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాములపాడు మండలంలో 951 మంది గ్రాడ్యుయేట్లు, 36 మంది ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తెలిపారు.

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాలు , ఓటర్ల జాబితాను ఎంపీడీఓ కార్యాలయంలో నోటీస్‌బోర్డులో అందుబాటులో ఉంచామని చెప్పారు. ఓటర్ల జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 18వ తేదీలోపు తెలియజేయాలని కోరారు.

ఊరూరా అన్నదాన శిబిరాలు





తంగడంచ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరంలో భక్తులకు అన్నం వడ్డిస్తున్న దృశ్యం,అన్నదాన శిబిరం వద్ద భోజనం చేస్తున్న భక్తులు

జూపాడుబంగ్లా: కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తులకు అన్నదానం, అల్పాహారం, మజ్జిగ, పండ్లు పంపిణీ వంటి కార్యక్రమాలు చేస్తూ దాతలు భక్తుల సేవలో తరిస్తున్నారు. ఈనెల 18న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కర్ణాటక, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి శివ మాలధారులు, భక్తులు కాలినడక శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబమల్లిఖార్జున స్వామివార్లను దర్శించుకునేందుకు వెళ్తున్నారు. కాలినడకన వెళ్తున్న వారి ఆకలి, దప్పులను తీర్చేందుకు గ్రామాల్లో అన్నదాన శిబిరాలు ఏర్పాటుచేశారు. బ్రాహ్మణకొట్కూరు, బొల్లవరం, నందికొట్కూరు జమ్మిచెట్టు, మండ్లెం పుల్లయ్యబావి, తంగడంచ, జూపాడుబంగ్లా శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, పాములపాడు, కరివేన ఎస్సార్బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో అన్నదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. మరి కొందరు దాతలు భక్తులకు మజ్జిగ, యాపిల్, చీని, అరటి పండ్లను పంపిణీ చేస్తున్నారు.

కైలాసద్వారం వద్ద దాతల అన్నదానం

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలం కైలాస ద్వారం వద్ద శనివారం నుంచి కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామస్తులు విరాళాలతో గ్రామస్తులే వలంటీర్లుగా అన్నదానం చేస్తున్నారు. రోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం వడ్డిస్తున్నారు. రోజుకు 6వేల మందికి భోజనాలు అందజేస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు.

సీఎం జగన్ చెప్పారంటే.. చేస్తారంతే



ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాను సన్మానిస్తున్న 98 క్వాలిఫైడ్స్

నంద్యాల(వ్యవసాయం): సీఎం జగన్ ఏదైనా మాట ఇస్తే దాన్ని చేసి తీరుతారని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆదివారం త్వరలో ఉద్యోగాలు పొందబోతున్న 98 డీఎస్సీ క్వాలిఫైడ్స్ ఆయనను సన్మానించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ పాతికేళ్లుగా ఉద్యోగం కోసం నిరీక్షిస్తున్న డీఎస్సీ క్వాలీఫైడ్స్‌కు సంబంధించి ఇటీవల కేబినెట్‌లో ఆమోద ముద్ర లభించిందని, త్వరలో ఉద్యోగాలు అందుతాయని చెప్పారు. ముఖ్యమంత్రి నిర్ణయంతో రాష్ట్రంలో 4,534 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు రానుండటంతో వారి కుటుంబాల్లో వెలుగులు నిండాలని, వారంతా టీచర్లుగా రాణించాలని, ఉత్తమ విద్యార్థులను తయారు చేసి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని కోరారు. సంఘం రాష్ట్ర నాయకులు సోమసుందర శాస్త్రి, బైరెడ్డి శ్రీనివాసరెడ్డి, తిమ్మారెడ్డి, రామాంజనేయ వరప్రసాద్, నాగరాధిక, ప్రకాష్, లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.

కొత్తూరులో భక్తజన సందడి

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరులో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. మాఘమాసం కావడంతో భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఆలయానికి చేరుకున్న భక్తులు పిండి పదార్థాలు తయారు చేసి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

పలువురు విరాళం

కర్నూలులో నివాసముంటున్న ఈర్నపాడు గ్రామానికి చెందిన పిట్టం నాగ సుధాకర్‌రెడ్డి రూ.50వేలు , పిట్టం తరలితరెడ్డి రూ.10 వేలు, నంద్యాల పట్టణానికి చెందిన ధరణి నాగేంద్ర రూ.10వేలను అన్నదాన పథకానికి విరాళంగా ఇచ్చినట్లు ఈఓ రామక్రిష్ణ తెలిపారు. గడివేముల మండలం కరిమద్దెల గ్రామానికి చెందిన ఆకుమళ్లబాబు 5 గ్రాముల బంగారు పడిగెను వితరణగా ఇచ్చారు.

కొత్త కాలనీలు వెలుస్తున్నాయ్



జగనన్న కాలనీలో నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఆత్మకూరు: రాష్ట్రంలో జగనన్న కాలనీల పేరుతో కొత్త కాలనీలు వెలుస్తున్నాయని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తెలిపారు. స్థానిక చక్రం హోటల్ వెనుక జగనన్న కాలనీలో ఆదివారం నూతన గృహ యజమానులు ఇస్మాయిల్, మున్నీ దంపతుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే వారితో నూతన గృహ ప్రవేశం చేయించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలు పూర్తయితే పట్టణంలో కొత్త కాలనీలుగా వెలగనున్నాయన్నారు. రాష్ట్రంలో లేని విధంగా ఆత్మకూరులో నిరుపేదలకు ఒకటిన్నర సెంటు చొప్పున స్థలం మంజూరు చేశామని చెప్పారు. పేదలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. అంతకు ముందు జగనన్న కాలనీలో గృహప్రవేశం చేశారు. అనంతరం ఇస్మాయిల్, మున్నీ దంపతులు ఎమ్మెల్యే, కో ఆప్షన్‌సభ్యుడు రషీద్‌ను సన్మానించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు అంజాద్‌అలీ, విజయచౌదరి, రాజగోపాల్,పువ్వాడ భాస్కర్,సుల్తాన్,కలీముల్లా, ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

బ్యారేజీతో కూడిన వంతెన నిర్మించాలి

ఆత్మకూరు: కృష్ణానదిపై సిద్దేశ్వరం వద్ద వంతెనతో పాటు బ్యారేజీ నిర్మించాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, రామేశ్వరరెడ్డి, జహురుల్లా కోరారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డిని ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కృష్ణానదిపై కేంద్ర ప్రభుత్వం వంతెనను నిర్మించడానికి అనుమతులు ఇచ్చిందని, వంతెన కంటే రాయలసీమవాసుల కోసం బ్యారేజీ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి తీసుకెళ్లాలని కోరారు. సభ్యులు రామచంద్రారెడ్డి, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రాజెక్టు నిర్మాణంతో సీమకు తీవ్ర నష్టం

జూపాడుబంగ్లా: భద్ర నదిపై ప్రాజెక్టు నిర్మాణం వల్ల సీమ ప్రాంత రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని సీపీఐ నాయకుడు రఘురామ్మూర్తి తెలిపారు. ఆదివారం ఆయన నందికొట్కూరు పట్టణంలోని జైకిసాన్ పార్కులో విలేకరులతో మాట్లాడుతూ పక్క రాష్ట్రాల అభిప్రాయాలకు విరుద్ధంగా, దిగువ రైతులకు నష్టం కలిగించేలా ప్రాజెక్టులు చేపట్టడం, ఇందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం దుర్మార్గమన్నారు. రాయలసీమ రైతాంగానికి జరిగే అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 14న సీపీఐ రాష్ట్ర బృందం సభ్యులు ఉమ్మడి జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించనున్నట్లు తెలిపారు. రమేష్‌బాబు, ఏఐఎస్ఎఫ్ నాయకుడు శ్రీనివాసులు, వీరేంద్ర పాల్గొన్నారు.

మహానంది ఈఓకు సన్మానం



ఈఓ చంద్రశేఖర్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న చైర్మన్, సిబ్బంది

మహానంది: దేవస్థానం ఈఓగా కాపు చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఆయనను సన్మానించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని, ఏఈఓ వై.మధు, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు అభినందించారు. ఏడాది కాలంలో పరిపాలనా పరంగా ఎన్నో మార్పులను తీసుకువచ్చి ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్న తీరును అభినందించారు. ఇదిలా ఉండగా చంద్రశేఖర్‌రెడ్డిని మరో ఏడాది వరకు ఇదే పోస్టులో కొనసాగిస్తూ దేవదాయశాఖ కమిషనర్ హరిజవహర్ లాల్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

మహానందీశ్వరుడికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం

మహానంది: మహానందీశ్వరస్వామికి ఆదివారం శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ధర్మకర్తలు కొండూరు సునీత, చెంచులత పట్టువస్త్రాలు సమర్పించారు. మహానంది ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిలు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి ట్రస్ట్ బోర్డు సభ్యులు శ్రీ కామేశ్వరీ, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. వచ్చే ధర్మకర్తల మండలి సమావేశంలో మహానందీశ్వరస్వామికి పట్టువస్త్రాల సమర్పణపై చర్చించి ప్రతి ఏడాది అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీతారామాపురం రామసుబ్బయ్య, ఆలయ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, సూపరింటెండెంట్లు ఓంకారం వెంకటేశ్వరుడు, అంబటి శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరులో ఓ యువతి అదృశ్యమైంది. ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. పెద్దనాన్న సామేలు ఆరోగ్యం బాగా లేకపోవడంతో చూసి పోయేందుకు పాములపాడు మండలం మిట్టకందాల గ్రామానికి చెందిన శిరీష ఈ నెల 10వ తేదీన మిడుతూరుకు వచ్చింది. అదేరోజు మధ్యాహ్నం 2 గంటలకు బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కలవారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో తల్లి సాలెమ్మ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.